19-07-2025
శనివారం
మల్కాజిగిరి
jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 56 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

## ఫార్మా రంగం బెస్ట్.. మరో విప్లవానికి శ్రీకారం...

# ఆగస్టు 1 డీల్ / నో డీల్



2 లో

ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే ఆగస్టు ఒకటో తారీకు డీల్/ నో డీల్.. అనే వార్త ఇప్పుడు సర్వత్ర ఆసక్తిని కలిగిస్తుంది. డీల్ కుదిరితే ఏమవుతుంది? డీల్ కుదరకపోతే పరిస్థితులు ఏమైతాయి? అనే వాటిపై స్థానిక వాణిజ్య పరిశ్రమల పరిస్థితి అయోమయంగా కనిపిస్తోంది!? ఆగస్టు 1వ తేదీన వాణిజ్య ఒప్పందం భారత్ అమెరికా దేశాల మధ్య చివరి దశలో ఉన్నాయి. వాషింగ్టన్ లో మినీ ట్రేడ్ వార్ జరగబోతుంది. ఆగస్టు ఒకటి డెడ్ లైన్ దగ్గర పడుతుండడంతో ఆలోపే ట్రేడ్ వార్ ముగింపు దశకు చేరుకోవాలని ఆలోచనలతో భారత్ సమాయత్తమవుతోంది. మన దేశంలో ఆటోమొబైల్స్ పౌల్ట్రీ ప్రొడక్ట్, డైరీ వీటితోపాటు ఫార్మా రంగంలో తీవ్ర స్థాయిలో ఉత్పత్తి రంగంలో మనం ముందు వరుసలో ఉన్నాం. అలాగే ఎలక్ట్రానిక్స్ రంగంలో 19% 25%డీల్ వర్కౌట్ అయ్యేలా కనిపిస్తోంది.

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

■ సీఎం రేవంత్ రెడ్డి



జయభేరి, నాగర్ కర్నూలు:

నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం తన బాధ్యత అంటూ స్పష్టం చేశారు. వెనుకబడిన కొల్లాపూర్ ప్రాంతానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్లోగా భూసేకరణ పూర్తి చేసి, కృష్ణా జలాలను పొలాలకు తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేసారు. పాలమూరు పచ్చగా మారాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లక్ష్యం కోసం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. రేవంత్ తన ప్రసంగంలో కేసీఆర్,

...మిగతాది 2 లో




## ఏఐ విమాన ప్రమాదం మృతుల కోసం రూ.500 కోట్లతో టాటా ట్రస్ట్

జయభేరి, న్యూఢిల్లీ:

టాటా సన్స్ అండ్ టాటా ట్రస్ట్స్ శుక్రవారం నాడు కీలక నిర్ణయం తీసుకుంది. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు

...మిగతాది 2 లో

## తమ్ముడి లోకేష్ తో కలిస్తే తప్పేంటీ

జయభేరి, ఖమ్మం, జూలై 18:



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. తన పదవికి అడ్డం వస్తారో అని మంత్రుల ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారని కామెంట్ చేశారు. తమ్ముడిలాంటి లోకేష్‌ను కలవడానికి రాత్రి వెళ్లాల్సిన అవసరం లేదని పట్టపగలే కలుస్తానని అన్నారు. ఖమ్మంలో పర్యటించిన కేటీఆర్ పువ్వాడ అజయ్ నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి తన వాళ్ల కోసం ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారే తప్ప ప్రజలకు ఎలాంటి పనులు చేయడం లేదని అన్నారు. ఢిల్లీకి మూటలు, తన కుటుంబానికి కాంట్రాక్టులు, చంద్రబాబుకు గోదావరి నీళ్లు, ఇలా తనకు కావాల్సిన ఆరు గ్యారంటీలు మాత్రం అమలు అవుతున్నాయని అన్నారు.

...మిగతాది 2 లో



## దంచికొడుతున్న వాన అటుగా రావద్దు, బిగ్ అలర్ట్..!!

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ లో వర్షం దంచి కొడుతోంది. పలు ప్రాంతాల్లో కుండపోత వాన కురుస్తోంది. ప్రధాన రహదారులన్నీ నీటిలో మునిగాయి. వర్షపు నీటితో ట్రాఫిక్ సమస్యలు మొదలయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో భారీ వర్షంతో వాహనాలు ముందుకు కదలటం లేదు. ఈ వర్షం శుక్రవారం రాత్రి మొత్తం కొనసాగే అవకాశం ఉంది. దీంతో, అత్యవసరం అయితేనే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరం భారీ వర్షంతో తడిసి ముద్దైంది. కొంత కాలంగా పెరిగిన ఎండ వేడితో నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. తాజా వర్షాలతో ఉపశమనం పొందారు. అయితే, మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, మెహదీపట్నం, మణికొండ, టోలిచౌకి, షేక్‌పేట్, గోల్కొండ, అత్తాపూర్, లంగర్‌హౌస్, బంజారాహిల్స్, తార్నాక, ఓయూ, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లి, కేపీహెచ్బీ, నిజాంపేట్, మియాపూర్, మూసాపేట్ సహా బాలానగర్, సనత్‌నగర్, ఎర్రగడ్డలో భారీ వర్షం కురుస్తోంది. అలాగే మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, శేరిలింగంపల్లి, హకీంపేట్, కంటోన్మెంట్, ఖైరతాబాద్‌లోనూ భారీగా వర్షం పడుతోంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

ఆరుగురు మావోయిస్టులు మృతి

- జయభేరి, ఛత్తీస్‌గఢ్ జూలై 18:

ఛత్తీస్‌గఢ్ లోని నారాయణ్‌పూర్ జిల్లాలో మావోయిస్టులకు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికే ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. సంబంధిత పోలీస్ అధికారులు ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. అంబూజ్‌మడ్ రీజియన్‌లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని సమాచారం అందడంతో శుక్రవారం ఛత్తీస్‌గఢ్ పోలీసులు, భద్రతాబలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మరణించారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి.

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

- ఏపీలో పరిశోధనలు చేయండి - పెట్టుబడులు పెట్టండి
- తక్కువ వ్యయంతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయండి
- రెండు రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్
- గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సదస్సులో ఇంధన రంగానికి చెందిన సీఈఓలు, ఎండీలతో సీఎం ముఖాముఖి
- ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సీఎం సమక్షంలో రూ.51 వేల కోట్ల ఒప్పందాలు



జయభేరి, అమరావతి, జూలై 18:

హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు

...మిగతాది 2 లో

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

■ మంత్రి సితక్క

జయభేరి, భూపాలపల్లి :

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని మహిళ శిశు సంక్షేమ శాఖ , గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యం తోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు జరిగాయి... ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు మహిళలు బోనాలతో గణ స్వాగతం పలికారు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు.. మహిళ సంఘాల బలోపేతానికి వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రజాప్రభుత్వం పనిచేస్తుందన్నారు... అనంతరం మహిళలకు 1కోటి 85 లక్షల వడ్డీ మాఫీ రుణాల చెక్కులు, మరణించిన మహిళ సంఘాల కుటుంబ సభ్యులకు 20 లక్షల చెక్కును




అందజేశారు.. ఇందిరా మహిళ శక్తి సంబరాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

కేటీఆర్ లపై వరుస విమర్శలు చేసారు. కేసీఆర్ హయంలో రూ.25వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు. జిల్లాకు చెందిన వివిధ ప్రాజెక్టులను పక్కన పెట్టారని ఆరోపించారు. తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఎక్కువ అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ హామీలు నెరవేరలేదని అన్నారు. రేవంత్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరు పచ్చగా మారుతుంటే కేసీఆర్కు దుఃఖం వస్తోందని అన్నారు. 2034 వరకు పాలమూరు బిడ్డ తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉంటాడని కేసీఆర్ గుర్తు పెట్టుకోవాలని అన్నారు. దీనిని కేసీఆర్ తన గుండెల మీద రాసుకోవాలని పేర్కొన్నారు.

## తమ్ముడి లోకేష్ తో కలిస్తే తప్పేంటి

ప్రజలకు ఇచ్చిన హామీల సంగతి మరిచిపోయి ఢిల్లీలో తన సొంత లాభం కోసం రాజకీయాలు చేస్తున్న రేవంత్ రెడ్డి తనపై మాత్రం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను లోకేష్‌తో అర్ధరాత్రి సమావేశం అయినట్టు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ తనకు తమ్ముడులాంటి వాడని ఆయన్ని కలవాలంటే పగలే కలుస్తానని అసలు ఆయన్ని కలవాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బాస్ చంద్రబాబు కుమారుడేనని ఆయన్ని కలిస్తే మాత్రం తప్పేంటని అన్నారు. మంచి సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు.ఏపీ మంత్రి నారా లోకేష్‌తో కేటీఆర్ అర్ధరాత్రి రహస్యంగా కలిశారన్న ఆరోపణలపై ఆయన స్పందించారు. "నేను లోకేష్‌ను కలవలేదు.. కలిసినా తప్పేంటి? లోకేష్‌ను అర్ధరాత్రి కలవాల్సిన అవసరం నాకేంటి?" అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలు చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి రహస్య ఒప్పందం బయటపడటంతో చేస్తున్న 'డైవర్షన్ పాలిటిక్స్' అని కేటీఆర్ విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ రేవంత్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారని కేటీఆర్ ఆరోపించారు. "బనకచర్లపై చర్చించామని ఏపీ మంత్రి నిమ్మల అన్నారు.. కానీ చర్చించలేదని రేవంత్ చెప్పారు. ఇందులో నిజం ఏది?" అంటూ నిలదీశారు.

**అసెంబ్లీ చర్చకు కేటీఆర్ సిద్ధం..**

"అసెంబ్లీలో చర్చిద్దామంటున్నారు.. మా మైక్ కట్ చేయకుండా ఉంటే చర్చకు సిద్ధం" అని కేటీఆర్ సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డిని "మానసిక హాస్పిటల్‌లో చూపించాలి" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలదీస్తూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. 'రేవంత్‌లా నేను దొంగను కాదు, సంచులు మోయలేదు' అంటూ కేటీఆర్ వ్యంగ్య బాణాలు విసిరారు. గోదావరి జలాలను చంద్రబాబుకు అప్పగించి తెలంగాణకు ద్రోహం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోన్లను రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. తన ముఖ్యమంత్రి సీటుకు ఎసరు పెడుతున్నారనే భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. త్వరలోనే ఆధారాలతో సహా అన్ని నిజాలను బయటపెడతానని కేటీఆర్ ప్రకటించారు. రేవంత్‌రెడ్డి తప్పు చేస్తే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి మాదిరిగా చీకట రాజకీయాలు తాము చేయబోమని అన్నారు కేటీఆర్. చిట్ చాట్‌ల పేరుతో రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఒకసారి హీరోయిన్‌లతో మరోసారి డ్రగ్స్‌కేసులో ఇలా ఒక్కోసారి ఒక్కో ఆరోపణ చేసి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.ఇలాంటి ఆరోపణలతో ఇంకాఎంత కాలం పబ్బగడుపుతారని ప్రశ్నించారు.

ఇలాంటివి కట్టిపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని సూచించారు. తప్పుడు ప్రచారమో లేదంటే తప్పుడు కేసులో ఏదో ఒక అంశంతో సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ఈ ఫార్ములా కారు రేసు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు అంటూ ఊదరగొట్టారని ఇలాంటి వాటిలో తమను ఏం చేయలేరని సవాల్ చేశారు. అప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరగలేదని ఇప్పుడు మాత్రం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరుల ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. తన పదవికి ఎక్కడ అడ్డం వస్తారో అని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారని విమర్శించారు. కాదు అని లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా అని సవాల్ చేశారు. రేవంత్ రెడ్డి చేతకానితనం వల్ల చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును కడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టు గురించి రేవంత్ ఎందుకు నిలదీయలేకపోతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల గొంతు కోస్తుంటే ఎందుకు రాజీ పడుతున్నారని నిలదీశారు. కేంద్రం వద్ద ఈ ప్రాజెక్టు ప్రస్తావన వచ్చిందని ఏపీ మంత్రి చెబుతుంటే.... అలాంటిదేమీ లేదని రేవంత్ బుకాయిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మేలు జరగకపోగా మరింత కీడు జరుగుతోందని కేటీర్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మంచి జరగకపోయినా పొంగులేటికి కాంట్రాక్ట్‌లు వచ్చాయని అన్నారు. కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో కాంట్రాక్ట్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు కేటీఆర్. పొంగులేటి ఇంటిపై దాడులు చేసి నోట్ల కట్టలు ఉన్నట్టు ప్రచారం చేసిన ఈడీ తర్వాత ఎందుకు సైలెంట్ అయ్యిందని అడిగారు.

## ఏఐ విమాన ప్రమాదం మృతుల కోసం రూ.500 కోట్లతో టాటా ట్రస్ట్

రూ.500కోట్లతో సంక్షేమ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించి 'ది ఏఐ171 మెమోరియల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్'ను ముంబైలో రిజిస్టర్ చేసింది. ఇందు కోసం టాటా సన్స్, టాటా ట్రస్ట్ చెరో రూ.250కోట్లు ట్రస్టుకు జమ చేయనున్నాయి.

విమాన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఈ ట్రస్టు అందజేస్తుంది. మానవ సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు (ఫిలాంత్రోపిక్ పర్పసెస్) ఏర్పాటు చేస్తున్న ఈ ట్రస్టు ద్వారా విమాన ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సహాయం అందించడం, ఘటనలో దెబ్బతిన్న బీజే మెడికల్ కాలేజీ ఇన్‌ఫ్రాస్టక్చర్ పునర్నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తారు.

జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలోని 241 మందితోపాటు.. విమానం కుప్పకూలిన మెడికల్ కాలేజీ ప్రాంతంలోని 19 మంది మృతిచెందారు. విమాన ప్రమాదంపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది.

## టీడీపీకి సీనియర్ నేత రాజీనామా.. భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి

**✍ జయభేరి, అమరావతి, జూలై 18:**

గోవా గవర్నర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత, కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పార్టీకి రాజీనామా చేశారు. విజయనగరం జిల్లా సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం రాజీనామా పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పూసపాటి అశోక్ గజపతిరాజు తన రాజీనామా లేఖను టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పంపించారు. టీడీపీ పార్టీ పొలిట్ బ్యూరోకు కూడా రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. పార్టీతో పాటు ప్రజలు, దేశానికి సేవ చేసేందుకు అవకాశం కల్పించిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ లేఖ కాపీని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి పంపారు. తన రాజీనామాను ఆమోదించాలని లేఖల్లో అధిష్టానాన్ని కోరారు.ఇటీవల దేశంలో మూడు రాష్ట్రాలకు ముగ్గురు గవర్నర్ల నియామకంలో అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ గా కేంద్రం నియమించింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీకి తప్పనిసరిగా రాజీనామా చేయాల్సి ఉండడంతో శుక్రవారం తన రాజీనామాను అధికారికంగా సమర్పించారు. 43 ఏళ్ల పాటు టీడీపీలోనే కొనసాగిన ఆయన 2004లో మినహా వరుసగా విజయనగరం ఎమ్మెల్యే, ఎంపీగా గెలుస్తూ వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా కొనసాగారు.

## ఫార్మా రంగం బెస్ట్.. మరో విప్లవానికి శ్రీకారం...

# ఆగస్టు 1 డీల్ / నో డీల్

ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే ఆగస్టు ఒకటో తారీకు డీల్/ నో డీల్.. అనే వార్త ఇప్పుడు సర్వత్ర ఆసక్తిని కలిగిస్తుంది. డీల్ కుదిరితే ఏమవుతుంది? డీల్ కుదరకపోతే పరిస్థితులు ఏమైతాయి? అనే వాటిపై స్థానిక వాణిజ్య పరిశ్రమల పరిస్థితి అయోమయంగా కనిపిస్తోంది!? ఆగస్టు 1వ తేదీన వాణిజ్య ఒప్పందం భారత్ అమెరికా దేశాల మధ్య చివరి దశలో ఉన్నాయి. వాషింగ్టన్ లో మినీ ట్రేడ్ వార్ జరగబోతుంది. ఆగస్టు ఒకటి డెడ్ లైన్ దగ్గర పడుతుండడంతో ఆలోపే ట్రేడ్ వార్ ముగింపు దశకు చేరుకోవాలని ఆలోచనలతో భారత్ సమాయత్తమవుతోంది. మన దేశంలో ఆటోమొబైల్స్ పౌల్ట్రీ ప్రోడక్ట్, డైరీ వీటితోపాటు ఫార్మా రంగంలో తీవ్ర స్థాయిలో ఉత్పత్తి రంగంలో మనం ముందు వరుసలో ఉన్నాం. అలాగే ఎలక్ట్రానిక్స్ రంగంలో 19% 25%డీల్ వర్కౌట్ అయ్యేలా కనిపిస్తోంది.

- శర వేగంగా అభివృద్ధి చెంద బోతున్న ఫార్మా రంగం.!
- టారిఫ్ వార్ ల సంగతేంటి!?
- మార్కెట్ తోపులాటకు కారణాలేంటి?
- టాలీఫ్ ల విషయంలో ఎందుకు ఈ పోటీ..!?
- ఇండోనేషియా అమెరికా చేసుకున్న డీల్ అసలు సంగతేంటి!?
- టెస్లా కార్ల కంపెనీ రావడం ద్వార భారత్ ఆటోమొబైల్ రంగం అభివృద్ధి చెందు తుందా..!?
- స్థానిక పరిశ్రమల పరిస్థితి?
- ఉద్యోగ వ్యాపార రంగాల్లో ఎలా ఉండబోతోంది.
- గ్లోబల్ క్యాపిటల్ వార్ మొదలవుతుందా..!?
- ఐటీ రంగం భవిష్యత్తు ఏంటి?




**✍ జయభేరి, హైదరాబాద్ :**

అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం ఇరుదేశాలకు చాలా ముఖ్యమైనది. అందుకే ఇరుదేశాలు స్టాటజిక్ వెళ్లాలని ఆలోచిస్తున్న తరుణంలో టారిఫ్ వార్ తగ్గించుకోవాలా వ్యాపార సంబంధాలు మెరుగుపరుచుకోవాలా అనే విషయంపై అటు అమెరికా ఇటు భారతదేశం స్టాటజిక్ ఆలోచనలతో ముందుకు నడుస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాపార సంబంధాలు మరింత మెరుగుపరుచుకునేందుకు టారిఫ్ వార్ను తగ్గించుకోవాలని ఆలోచనలతో అమెరికా ఇండోనేషియా డీల్ ను ముందర పెడుతుంది.

అమెరికా ఇండోనేషియా డీల్ అసలు సంగతి ఏంటి!?

అమెరికా దేశంలో ఉత్పత్తి రంగం చాలా వెనుక దశలో ఉంది. అక్కడ హెక్టార్లలో భూమి ఎక్కువ శాతం భూ సంపద ఉన్న వ్యవసాయ రంగం చేయడానికి యంత్రాల మీదనే ఆధారపడి పనులు చేస్తుంటారు. అంతేకాకుండా నిత్యవసరాలు వస్తువులను తయారు చేయలేని స్థితిలో అమెరికా ప్రభుత్వం ఉంది. టూత్ బ్రష్ నుంచి పేస్ట్ వరకు ప్రతిదీ ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన అవసరం ఆ దేశానికి ఏర్పడుతుంది. అందుకే యూఎస్ఏ వాణిజ్య ఒప్పందంలో ఎకనామిక్ రంగాన్ని పైకి తీసుకురావడానికి మ్యానుఫ్యాక్చర్ అభివృద్ధి చేసుకోవడానికి అనుగుణంగా ట్రేడ్ డీల్ ని ఇండోనేషియాతో కుదుర్చుకుంది. 1996 రుణ ఈ డీల్ కుదుర్చుకొని ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి చర్చల ద్వారా ఎగుమతులు దిగుమతులు మీద టారిఫ్ లను మార్చుకుంటూ వస్తోంది. ఇండోనేషియా అమెరికా డీల్ ఒప్పందం అమెరికాకే ఎక్కువగా లాభసాటిగా కనిపిస్తోంది. ఎందుకంటే అమెరికా తన సొంతంగా ఏది సంపాదించుకోకుండా చైనా ఇండియా బంగ్లాదేశ్ నుండి బ్రష్లను పేస్టులను మౌలిక వసతులలో ఉపయోగపడే పరికరాలు అన్నింటిని దిగుమతి చేసుకుంటుంది. దిగుమతులను చేసుకోవడం ద్వారా ఆ సుంకాలను తగ్గించి ఎగుమతులు చేసే సుంకలను పెంచుతూ అమెరికా పెత్తనం చలాయిస్తుంది.

టారిఫ్ ల విషయంలో అసలు ఎందుకు ఈ పోటీ.!?

యూఎస్ఏ వాణిజ్య రంగంలో పూర్తిగా మ్యానుఫ్యాక్చర్ రంగంలో వెనుకబడిపోయింది. తమకు కావలసిన చిన్న చిన్న వస్తువులను కూడా తయారు చేసుకోలేని స్థితిలో అమెరికా ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటుంది. అందుకే అమెరికా తమ దేశంలో మ్యానుఫ్యాక్చర్ రంగాన్ని మరింత పుంజుకునేలా చేయాలనే ఉద్దేశంతో ఎకనామికల్ గా తమ ఆర్థిక రంగాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతోనే టా ల విషయంలో పోటీ తత్వాన్ని ఏర్పడేలా చేస్తుంది. ఇదే కోవలో టెస్టుల కార్ల కంపెనీ ముంబైలో అడుగుపెట్టింది. ఆటోమొబైల్ రంగం ద్వారా ఎకనామికల్ గా అభివృద్ధిలో నడవాలని ఉద్దేశంతోటే దాదాపు నాలుగు మిలియన్ కార్ల అమ్మకాలను ఈ కంపెనీ మన దేశంలో చేసింది. అలాగే కార్ మ్యానుఫ్యాక్చర్ ని కూడా మన దేశంలో ఏర్పాటు చేయడానికి ప్లాన్ చేసింది.

మనదేశంలో అగ్రగామి రంగం ఏదైనా ఉంది అంటే అది వ్యవసాయం ఆ తర్వాత ఆటోమొబైల్ రంగం. ఈ రంగాలపై 100 నుంచి 110 శాతం వరకు టారిఫ్ విధిస్తున్నారు. ఆటోమొబైల్ రంగంలో టాటా మహేంద్ర ఈ కంపెనీలు తగ్గింపు పై టారిఫ్లు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ రంగాలపై యుఎస్ఏ జీరో పర్సెంట్ తగ్గించాలని అడుగుతుంది. డొమెస్టిక్



**✍ కడారి శ్రీనివాస్**
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు,
రచయిత, సామాజిక ఉద్యమకారులు

ఇన్వెస్ట్మెంట్, ఎంప్లాయిమెంట్ రంగంలో ఎక్కువగా ప్రచారాన్ని కొనసాగిస్తుంది. అందుకే ఈ రంగాలపై సర్ చార్జెస్ విధిస్తుంది. ఇక భారత్లో సర్వీస్ రంగం 40 శాతం ఉన్న నేపథ్యంలో దాదాపు 60 కోట్ల మంది వ్యవసాయంపై ఆధారపడి డైరీ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ, పాడి పంట ఈ రంగాలలో ప్రథమ స్థానంలో ఉంది మన భారతదేశం. కానీ మనదేశంలో సగటును ఒక మనిషికి రెండు ఎకరాలు ఉంటే అదే అమెరికాలో 15 సెక్టార్ల భూమి ఉంటుంది. అంటే మనదేశంలోనీ ప్రజలకంటే అమెరికాలో ఉన్న ప్రజలకే ఎక్కువ భూమి ఉంటుంది. కనుక అమెరికాలో సబ్సిడీ ఎక్కువగా ఉంటుంది మన భారతదేశంలో సబ్సిడీ తక్కువగా ఉంటుంది.

భారతదేశంలో ఫార్మా రంగం యొక్క భవిష్యత్తు ఏంటి!?

గ్లోబల్ వార్ బయో వార్ వచ్చిన తర్వాత అనేక బ్యాక్టీరియా వైరస్ లు ప్రపంచాన్ని భయపెడుతున్న నేపథ్యంలో ఫార్మ కంపెనీలు అగ్రస్థానంలో తమ భవిష్యత్తును నిలబెడుతున్నాయి. నవీన ఆధునిక సమాజానికి కావలసిన ఆయుర్వేద ఫార్మా ఉత్పత్తి రంగం అగ్రగామిలో నిలుస్తూ వస్తున్న ధరలు పెరుగుదల ఇంకా ఉంటాయి. ఎగుమతులు ఎక్కువగా పెరుగుతూ ఆదాయ మార్గాలు కూడా మన దేశానికి పెరుగుతాయి.

ప్రస్తుతం మన దేశానికి 60 శాతం పైన యూఎస్ఏ దిగిమతులు చేసుకుంటుంది. భవిష్యత్తులో ఫార్మా రంగం నెంబర్ వన్ గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇక ఐటీరంగంపై ఇప్పటికే ఏఐ సాఫ్టేర్ వచ్చిన తర్వాత ఐటీ రంగం పూర్తిగా వెనుకంజలో ఉంటుంది. హెచ్ వన్ బి వీసాల విషయంలో కానీ పూర్తిగా అమెరికాలో ని కంపెనీలన్నీ మనదేశంలో ఉన్నాయి కాబట్టి ఐటీ రంగానికి అంతగా అభివృద్ధి కనిపించడం లేదు. మొత్తానికి వ్యవసాయం పౌల్ట్రీ రంగం అలాగే ఫార్మా రంగం ఈ మూడు విషయాల్లో భారతదేశం అగ్రగామిగా నిలుస్తూ ఆర్థిక వనరులను సమకూర్చే దిశగా భారత్ అడుగులేస్తుంది. దీని ద్వారా మన స్థానిక వాణిజ్య పరిశ్రమల పరిస్థితి ఆశాజనకంగా ఉండబోతోంది. దీంతో ఉపాధి అవకాశాలు మార్కెట్ తోపులాటకు తలుపులు పడుతూ సులువుగా సాగే అవకాశం భారత్కు ఉంటుంది. విద్య ఉద్యోగ ఉపాధి ముప్పు తప్పుతుంది. దీని ద్వారా భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు పోవడానికి అవకాశం ఉంటుంది.



## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

చేయాలని, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. గ్రీన్ హైడ్రోజన్ ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈమేరకు యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ.." గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలి. 2070 నాటికి కర్బన రహిత ఇంధనాలు వాడాలన్నది మన జాతీయ లక్ష్యం.తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజ్‌పై దృష్టి సారించాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు ఏపీ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇంధన ఖర్చు తగ్గాలి ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యం. గ్రీన్ హైడ్రోజన్‌తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వడం సాధ్యం. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంలో ఏపీ ప్రముఖ భాగస్వామిగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్**

ఇంధన రంగంలో ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని పరిశోధకులకు సీఎం పిలుపునిచ్చారు. సంప్రదాయ ఇంధన వనరుల కారణంగా తీవ్రమైన కాలుష్యం బారిన పడుతున్నామని నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని సీఎం అన్నారు. ఇక సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్ దేనని.. ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే తక్కువ ఖర్చుతో సామాన్యులు కూడా వ్యయం భరించేలా ఉండే దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసేందుకు ప్లాంట్ ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అలాగే కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితో పాటు ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని స్పష్టం చేశారు. అమరావతిలో కృత్రిమ మేథ కేంద్రంగా క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నూ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. రెండు రోజుల సదస్సు అనంతరం అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ను ప్రకటిస్తామని.. ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలు పై సమీక్షిస్తామని సీఎం వెల్లడించారు.


**గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సీఎం సమక్షంలో రూ.51 వేల కోట్లకు ఒప్పందాలు**

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్సఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి 1 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాట్ ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్ఎహెచ్ ఇన్ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలోటన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్ , 600 కిలోటన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాట్లను ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.35 వేల కోట్ల రూపాయల్ని పెట్టుబడి పెట్టనుంది. అంతకుముందు సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సీఈఓలు, ఎండీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సదస్సుకు నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# ఇంటికి దీపం ఇల్లాలు

- ఇంటికి దీపం ఇల్లాలు అందుకే ఆడబిడ్డలనే లబ్దిదారులుగా చేర్చి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఇందిరమ్మ ప్రభుత్వం..

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం :**




శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడులో ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తో కలిసి ముఖ్య అతిథి గా పాల్గొన్నాను.

ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ. 3,26,00000, బ్యాంక్ లింకేజ్ రుణాలు రూ. 19,18,00000, లోన్ బీమా రూ. 5,5119, మహాలక్ష్మి బస్సుల అద్దె రూ.2,08,404 చెక్కులను అందించాము. వీటితో పాటు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను కూడా ఇవ్వడం జరిగింది.

బతుకమ్మ చీరల మాదిరిగా కాకుండా రాబోయే రోజుల్లో మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు అందించనున్నాము. ఇది ప్రజల దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోసమే పాటుపడుతుంది. మొదటి విడతలో రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాము. ఒక్క పినపాక నియోజకవర్గానికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 300 కోట్లు కేటాయించాము. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోని 33 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.

తరచుగా ముంపుకు గురయ్యే పినపాక నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టించడం జరుగుతుంది.

ఇప్పటికే పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని సూచిస్తున్నాను.

పినపాకలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం పూర్తయ్యేలా చూసే బాధ్యతగా మాటిస్తున్నాను. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎవరెన్ని కుట్రలు పన్నినా ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉంది.



## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా హరిత భారత్

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి లోని కొంపల్లి 1 సి.బి.ఎస్.సి బ్రాంచ్ శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా హరిత భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి ఇంటి వద్ద, పాఠశాలలో ఒక్కో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేష్ రెడ్డి గారు మాట్లాడుతూ చెట్లను సంరక్షించే బాధ్యతను విద్యార్థి దశ నుండే ప్రారంభించాలని దాని వలన పర్యావరణం సంరక్షించబడుతుందని అందరూ ఆరోగ్యంగా జీవించగలమని తెలియచేశారు. స్పృహను కలిగించే కార్యక్రమాలను చేపడుతున్నారని విద్యార్థులకు చక్కని విద్యతో పాటు సామాజిక సామాజిక స్పృహను కలిగించే కార్యక్రమాలను చేపడుతున్నారని శ్రీ చైతన్య పాఠశాలల అకడమిక్ డైరక్టర్ సీమ తెలిపారు. ఈ సందర్భంగా ఏ.జి.ఎమ్ రమణారావు, ఆర్ ఐ శ్రీనివాస రావు, శ్రీ చక్రి, కో ఆర్డినేటర్స్ రవి కుమార్ (సిబిఎస్ఈ), జోనల్ కోఆర్డినేటర్స్ రవి, అన్నపూర్ణ, (సిబిఎస్ఈ) ప్రిన్సిపాల్స్ రాజేశ్ రెడ్డి, శంకరరావు, గీత, డీన్ సోమేశ్వర్, ఇంచార్జీలు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.

## పురుష వయోవృద్ధులకు అన్ని వసతులతో పేమెంట్ ఆశ్రమం



**జయభేరి, దేవరకొండ:**

మహాలక్ష్మి మహిళా వృద్ధుల ఆశ్రమం ఆవరణలో పురుషవృద్ధుల కొరకు నూతనముగా 12 గదులతో ఆశ్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులురాలు శ్రీమతి మాదిరెడ్డి సంధ్యారెడ్డి రిటైర్డ్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మరియు కార్యవర్గం సభ్యులకు వివరించారు. వారు భవనము, వసతులు పరిశీలించి చక్కగా ఏర్పాటు చేసినారు అని అన్నారు. మా పెన్షనర్స్ ఒంటరి వారికి తెలియజేసి ఇక్కడ వుండే ఏర్పాటు చేస్తాము అన్నారు. సంధ్యారెడ్డి మీ శ్రమకు ధన్యవాదములు అని పాలుగొన్న పెన్షనర్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ టేకర్ జానకి, పెన్షనర్స్ సంఘం బాద్యులు మాదాసు రాములు, అప్పం వీరయ్య, మునిని వీరయ్య, మహమ్మద్ మౌలానా,లక్ష్మి నారాయణ, అలంపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ 2024, 25లో దేవరకొండ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంకు



**జయభేరి, దేవరకొండ :**

కేంద్ర ప్రభుత్వం పరిశీలించి ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024,25 లో దేవరకొండ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంకు సాధించిందని మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ తెలిపారు. పారిశుద్ధ్యం, బహిరంగ మలవిసర్జన నిర్మూలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును బహుకరించిందని తెలిపారు. పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఈ అవార్డు సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా అందరి ప్రోత్సాహంతో పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి, మున్సిపల్ సమస్యలను పరిష్కరిస్తూ సింగిల్ డిజిట్స్ ర్యాంకు రావడానికి కృషి చేస్తానని తెలిపారు.

## మాజీ మంత్రికి జన్మదిన తెలిపిన రాష్ట్ర నాయకులు కంకణాల



**జయభేరి, చింతపల్లి :**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు,సూర్యపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్ లోని నివాసంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు నల్లగొండ జిల్లా మంత్రిగా జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. గత రాష్ట్ర క్యాబినెట్ లో గౌరవప్రదమైన మంత్రిగా పేరు ప్రఖ్యాతలు పొందిన పెద్దలు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి చిరకాలం ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉంటూ ప్రజల కొరకు ప్రజా సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల రైతు బంధు మాజీ కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాంబాబు నాయక్, నడింపల్లి యాదయ్య గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కల్తీ పాలు తయారీ స్థావరంపై దాడి

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం 06.00 గం.ల సమయంలో సాయి మహదేవ్ నగర్ లోని కల్తీపాల తయారీ స్థావరంపై SOT మల్కాజ్గిరి వారు మల్లేష్ ASI, నాగేందర్, మేడిపల్లి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సదరు తయారీదారుడు అయిన మురళీకృష్ణ రెడ్డి తన ఇంట్లో హైడ్రోజన్ పెరాక్సైడ్, గ్యాన్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ తో కల్తీ పాలు తయారుచేసినట్టు గుర్తించారు. అదేవిధంగా ఈ స్థావరంలోని 110 లీటర్ల కల్తీ పాలు, 1.1 లీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 19 గ్యాన్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ ప్యాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కల్తీ పాలు తయారు చేస్తున్న గంగలపుడి మురళీకృష్ణారెడ్డి పై కేసు నమోదు చేసి తగిన చర్య తీసుకోవడం జరిగింది.



## ఏకలవ్య మోడల్ స్కూల్ లో లైంగిక వేధింపులు



**జయభేరి, మహబూబాబాద్:**

బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ లో లైంగిక వేధింపుల ఆరోపణలు గుప్పుమన్నాయి. ఓ ఉపాధ్యాయుడు వేధిస్తున్నట్లు ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని ఆరోపించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు అందుకున్న పోలీసులు, రహస్యంగా విచారణ కొనసాగిస్తున్నారు.

# పేదరికాన్ని రూపు మాపేది విద్య ఒక్కటే

- చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి
- హాజిపల్లి గ్రామంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, షూలు పంపిణీ

**జయభేరి, షాద్ నగర్, జూలై 17 :**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం హాజిపల్లి గ్రామంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, షూలు, టైబెల్టులు, బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. చదువుతోనే పేదల తలరాతలు మారుతాయని, పేదరికాన్ని రూపుమపేది విద్య ఒక్కటే అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి ప్రధాని నరేంద్ర మోడీ విద్యాభివృద్ధికి అనేక రకాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము భవిష్యత్తులో డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, పోలీసులు అయ్యి తమ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువస్తామని విష్ణు వర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీనాథ్, ఉపాధ్యాయినిలు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ స్వాతి, నాయకులు ఇస్నాతి గంగాధర్, మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, రాజు నాయక్, సింగారం ప్రశాంత్, ఇస్నాతి ధరణిధర్, కటికే నవీన్, సింగారం రఘు, మహేశ్వరం నరసింహులు, కొండయ్యోల రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రివర్యులు జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- దేవరకొండ మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ ఉద్యమ వీరుడు.. నల్లగొండ అభివృద్ధి సూర్యుడు.. మాజీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులు,సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఘనంగా మాజీ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని కేక్ కాట్ చేశారు. నల్గొండ జిల్లా అభివృద్ధి ప్రధాత నిరంతరం ప్రజా సేవకై కృషి చేస్తు నేనున్నా అని అభయం ఇచ్చే మహోన్నత వ్యక్తి తెలంగాణ రాష్ట్ర మాజీ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి అని ఆయన అన్నారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో మీరు చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలి అని ఆయన ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయువు ఆరోగ్యాలతో విరాజిల్లాలని ఆ భగవంతుణ్ణి కోరుకోవడం జరిగింది.ఉమ్మడి నల్గొండ జిల్లాకు మాజీ మంత్రి కృషితోనే రెండు మెడికల్ కాలేజీలు మంజూరు కావడం జరిగింది అని అన్నారు. ఆనాటి ఉద్యమ సమయం నుంచి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీకి రథ సారధిగా వహించి జిల్లా రూపురేఖలను మార్చిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు టివిఎన్ రెడ్డి, రమావత్ దశ్రు నాయక్,మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ గౌడ్, గాజుల ఆంజనేయులు,రమావత్ మోహన్ కృష్ణ, ఇస్లావత్ అభిషేక్, రమావత్ ఉమెందర్, బొడ్డుపల్లి కృష్ణ,మాజీ సర్పంచ్ రేపాని ఇద్దయ్య, మకాం చంద్రమౌళి (సీఎం), జనీబాబా, కడారీ సైదులు,రమావత్ తూలిసిరామ్ నాయక్, మేడం రాములు, పాత్లవత్ లక్ష్మణ్, పొట్ట మధు, వాడిత్య బాలు, పగిడిమర్రి సతీష్, జానీ, బాబా, చిత్రం ఏసోబు, గుండాల వెంకట్, తరి గోవర్ధన్, కొమ్ము ఉదయ్, సైదులు, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ దేవాలయాన్ని పేల్చివేస్తామంటూ బెదిరింపు కాల్

- ఓ సాఫ్ట్వేర్ ఇంజినీర్ అరెస్టు

**జయభేరి, అమృత్సర్ జూలై 18:**

పంజాబ్లోని అమృత్సర్లో ఉన్న స్వర్ణ దేవాలయాన్ని పేల్చివేస్తామంటూ వస్తున్న బెదిరింపులకు చెందిన కేసులో పోలీసులు ఓ సాఫ్ట్వేర్ ఇంజినీర్ను అరెస్టు చేశారు. బెదిరింపు ఈమెయిల్స్ చేసిన అనుమానితుడిని శుభం దూబేగా గుర్తించారు.

అతని స్వస్థలం ఫరిదాబాద్. పోలీసు కమీషనర్ గురుప్రీత్ సింగ్ బుల్లార్ దీనిపై ప్రకటన చేశారు. పాక్షికంగా సక్సెస్ సాధించినట్లు ఆయన చెప్పారు. ప్రశ్నించే నిమిత్తం అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు కమీషన్ వెల్లడించారు.దూబేకు చెందిన ల్యాప్టాప్, మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపారు.

జూలై 14వ తేదీ నుంచి శిరోమని గురుద్వారా ప్రబందక్ కమిటీకి ఆరు సార్లు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. గోల్డెన్ టెంపుల్ను పేల్చివేస్తామని బెదిరించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు. ఈ కేసు విచారణ కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా భాగస్వామ్యమైనట్లు బుల్లార్ తెలిపారు. కొన్ని సాఫ్ట్వేర్ కంపెనీలతో అనుమానితుడికి లింకు ఉన్నట్లు తెలుస్తోంది.

# అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

జయభేరి, వెంకటాపురం, జులై18 :

అడవుల సంరక్షణ లో నిర్లక్ష్యం వహించిన, విది నిర్వహణలో అలసత్వం వహించిన సహించేది లేదని, కాలేశ్వరం జోన్ సి. సి. ఎఫ్. డాక్టర్ బి. ప్రభాకర్ అన్నారు.


ములుగు జిల్లా వెంకటాపురం ఎఫ్.డి.ఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వాజేడు, వెంకటాపురం, దూలాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎఫ్ ఓ రాహుల్ జాదవ్, వెంకటాపురం ఎఫ్డిఓ జి.ద్వాలియా పాల్గొన్నారు. సి.సి.ఎఫ్ డాక్టర్ బి. ప్రభాకర్ సమావేశంలో మాట్లాడుతూ అడవులను నరకటం, కలప స్లంగ్లింగ్, వన్యం ప్రాణుల సంరక్షణతో పాటు అటవీ సంరక్షణ చట్టాలు పకడ్బందీ గా అమలు పరచాలని ఆదేశించారు.

వన మహోత్సవాల సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కల నాటే ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించారు.

నర్సరీల ద్వారా మొక్కలు స్థానిక సంస్థలకు, సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు, పాఠశాలలకు, కళాశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, గృహస్తులకు సరఫరా చేయాలని ఆదేశించారు. వెంకటాపురం ఫారెస్ట్ డివిజన్లో అటవి శాఖ అనుమతి పొందిన వాటర్ ఫాల్స్ కు పర్యటకులకు అనుమతులు ఇవ్వాలని, అనుమతులు లేని వాటర్ ఫాల్స్ కు పర్యటకుల నిషేధమని, వాటర్ ఫాల్స్ వద్ద ప్రమాదాలు జరక్కుండా డ్యూటీ సిబ్బంది విదులు నిర్వహించా లని ఆదేశించారు.



అనంతరం వెంకటాపురం మండల కేంద్రం లోని కాపెడ్ సంస్థ లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల వద్ద సి సి ఎఫ్ డాక్టర్ బి ప్రభాకర్, డీఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఫారెస్ట్ అధికారు లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాజేడు, దూలా పురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. చంద్రమౌళి, దూలాపురం రేంజ్ ఆఫీసర్, కే.బాల కృష్ణ, మూడు రేంజీల సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏడో వార్డు అధ్యక్షులుగా పెరికేటి శ్రీనివాసచారి ఏకగ్రీవంగా ఎన్నిక

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణ ఏడవ వార్డు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా పెరికేటి శ్రీనివాస చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా బీసీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడుగా నియమితులైన పెరికేటి శ్రీనివాస చారి మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా దక్కేంత వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ తనపై ఉంచిన నమ్మకంతో ఏడో వార్డు అధ్యక్షులుగా పూర్తి బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఉపాధ్యక్షులు కే కృష్ణ, సురకారపు దశరథం గౌడ్, పున్న వెంకటేష్ నేత, అప్పం వీరయ్య, గడ్డం బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## తండాలో తాగు నీటి సమస్య

- నేనావత్ నాగార్జున నాయక్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం గిరిజానగర్ తండా గ్రామంలో గత నేల రోజుల నుండి కృష్ణ వాటర్ అరకొరగా రావడం అదే విదంగా కృష్ణ వాటర్ పైపు లీకేజ్ అయ్యి నీరు వృధాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. సుమారు 400 పైగా ఉన్న జనాభాకు కృష్ణ వాటర్ ఏ పెద్ద దిక్కుకు కావడం తో వాటర్ పై పై లీకేజ్ అయి నీరు వృధాగా పోవడం జరుగుతుంది. తక్షణమే అధికారులు మర్మతులు చెప్పటి ప్రజల దాహార్తి ని తీర్చగలరు అని గ్రామస్తులు అధికారులను కోరుకుంటున్నారు.

## డీసీపీ ఆధ్వర్యంలో నాకాబంది



జయభేరి, తుర్కపల్లి, జూలై 18 :

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ శివారు లోని జగదేవ్పూర్ ప్రధాన రహదారి ఎన్ హెచ్ 161 ఏ ఏ వద్ద భువనగిరి డిసిపి అక్షాంష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాకాబండి నీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో కలిసి నాకాబంది నిర్వహించినట్లు తెలిపారు. పాపిలాన్ డివైస్, బ్రీత్ అనలైజర్ తో అనుమానితులను తనిఖీ చేసినట్లు తెలిపారు. 71 వాహనాలను చెక్ చేయడం జరిగిందని అందులో ద్విచక్ర వాహనాలు 32, ఆటోలు 12, ఫోర్ వీలర్స్ 21, ఇతర వాహనాలు 13 అందులో సరియైన పత్రాలు లేని ఏడు వాహనాలకు చలాన్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏసిపి శ్రీనివాస్ నాయుడు, ఎస్సై తగ్గియోద్దీన్, ఏఎస్ఐ బాల నరసింహ, పోలీసులు పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యార్థులకు ఐడి కార్డ్స్, బెల్టులు, క్రీడా సామాగ్రిలు



జయభేరి, చందంపేట :

చందంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ చందంపేట విద్యార్థిని విద్యార్థులకు పానుగంటి శ్రీనివాసులు వారి కుమార్తె పానుగంటి అనన్య యు.ఎస్.ఎ 20వేల రూపాయల విలువగల ఐడి కార్డ్స్, బెల్టులు, క్రీడా సామాగ్రి అంద చేసినారు. ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ దాతల సహకారముతో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు సమకూర్చుకోగలుగుతున్నామని ధన్యవాదములు తెలియజేసినారు. అనన్య పానుగంటి మాట్లాడుతూ వారు బాగా చదివి వారు నచ్చిన రంగాలలో రాణించాలని కోరినారు. ఈ కార్యక్రమములో పానుగంటి మల్లయ్య, గోవిందు కొండయ్య, జోసెఫ్ చౌదరి, ఎల్ మధు, పిడి వెంకట్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతం చేసినారు.

## ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గీతారెడ్డి

జయభేరి, తుర్కపల్లి, జూలై 18 :

తుర్కపల్లి మండల ఎంపీడీవో గా లెంకల గీతారెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం నుండి తుర్కపల్లి మండలంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్లు జహంగీర్, సంతోష్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి

జయభేరి, ఉప్పల్ :




మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనూ చౌదరి అధ్యక్షతన జరిగిన దిశ కమిటీ మీటింగ్ లో దిశ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ సహచర ఎమ్మెల్యే తో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఉప్పల్ నియోజకవర్గంలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని 100 పడకల ఆసుపత్రి అలాగే గవర్నమెంట్ డిగ్రీ కళాశాలకి స్థలం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని వేరే స్కూల్ పేర్లు పెడుతూ.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్న వారి పర్మిషన్ రద్దు చేయాలని అలాగే డబుల్ బెడ్ రూంలో లిఫ్ట్ లు పనిచేయడం లేదు అని ప్రభుత్వ అధికారులను బెదిరిస్తున్న మీద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూరు ప్రాథమిక వైద్య కేంద్రంను పరిశీలించిన అడిషనల్ డీఎంహెచ్ వో

- డాక్టర్ శ్రీధర్ ఏజెన్సీ ప్రాంతంలో చేస్తున్న సేవలను అభినందించిన అడిషనల్ డీ ఎం హెచ్ వో

జయభేరి, చర్ల జులై 18 :

చర్ల మండల పరిధిలో ఉన్న కొయ్యూరు ప్రాథమిక వైద్య కేంద్రంను అడిషనల్ డి ఎం హెచ్ వో డాక్టర్ సైదులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డ్స్ పరిశీలించి తగిన సూచనలు చేసారు. కొయ్యూరు ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ శ్రీధర్ ఏజెన్సీ ప్రాంతంలో చేస్తున్న వైద్య సేవలను తెలుసుకొని అభినందించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధులు అశ్రద్ధ గా చేసినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. వర్షాకాలం సీజన్ అవ్వడం వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, అతిసార వ్యాధి, మొదలగు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, సిబ్బంది జాగ్రత్తలు వహించాలని వారికి సూచించారు. ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేసి జ్వరాలు ఎక్కువ ఉన్న గ్రామాల్లో ప్రత్యేకమైన వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ వో డాక్టర్ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదలకు ఇండ్లు

- మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్
- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో 6వ డివిజన్ లలో ఇందిరమ్మ ఇండ్లన పరిశీలన

జయభేరి, మేడిపల్లి :

సొంతిల్లు ఉండాలన్న ప్రతి పేదోడి కలను ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6 వ డివిజన్లో వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులుతో కలిసి పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, మాజీ గ్రంథాలయం చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కనకదుర్గ, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీరబల్లి అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

- 3 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం

జయభేరి, కడప:

సానిపాయ సమీపంలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో ఒక ఎర్రచందనం స్మగ్లర్ ను అరెస్టు చేయడంతో పాటు మూడు ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఎస్ఐ పీ. నరేష్ టీమ్ స్థానిక ఎఫ్ బీఓ అనిల్ కుమార్ తో కలసి వీరబల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేస్తుండగా అయ్యలవారి పల్లి వద్ద ఒక వ్యక్తి మోటారు సైకిల్ తో నిలబడి ఉన్నాడు. అతన్ని సమీపించడంతో అతను మోటారు సైకిల్ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు.

అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు అతన్ని పట్టుకుని, అతని వద్ద నుంచి మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

అతనిని తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతనిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు



## భారీ వర్షం

- భారీగా ట్రాఫిక్ జామ్
- లోతట్టు ప్రాంతాలు జలమయం

జయభేరి, ఉప్పల్ :

భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయంగా మారాయి, రహదారులన్నీ వరద నీటితో నిండిపోయి వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల వద్ద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8, JSN ఈస్ట్ కాలనీ (JSN కాలనీ నుండి వెలుగు గుట్ట రోడ్డు) ఇళ్లలోకి వర్షపు నీరు మోకాళ్ల లోతు వస్తోంది, ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. సంవత్సరాలు గడుస్తున్నాయి, శాశ్వత పరిష్కారం గురించి ఏ వ్యవస్థ పట్టించుకోవడం లేదు.



## చిత్స్వరూప!

తే.గీ. లేదు రూపము గుణములు లేనె లేవు
అంతటను యుండి పరమాత్మ అచలు
డాయె
వ్యాపకుడు తాను అన్యము వ్యాప్య
మగును
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. దేవయానము మోక్షము దివ్యముగను
మరల జన్మము మహిలోన తిరిగి రాదు
కర్మ సన్యాస యోగము మర్మమిదియె
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. జ్యేష్ఠుడగు ప్రాణమెంతయో శ్రేష్ఠుడగును
ఇంద్రియాలన్ని పనిచేయు నితనివలన
అన్నమే ప్రాణమగుచుండు తిన్న పిదప
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. ఇంద్రియముల తోడ ఇచ్ఛ పూర్తి యవగ
అదియె సుఖము గాను అలరు చుండు
కానిదంత కూడ కష్టమ్ముగా దోచు
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. ధర్మమార్గము వీడక ధరణి యందు
ఎవరికిని హాని తలపెట్టకెపుడు గాని
భక్తి జ్ఞానమ్ము తోడను బ్రతుక వలెను
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!




జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734



# ప్రముఖ హాస్య నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత

కొంతకాలంగా మూత్రపిండాల సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న ప్రముఖ హాస్య నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూశారు. చందానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన 54 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ యాసలో విలనిజాన్ని, కామెడీని పండించిన వెంకట్ మరణంతో సినీ పరిశ్రమ ఒక మంచి నటుడిని కోల్పోయింది. ఫిష్ వెంకట్‌గా తెలుగు ప్రేక్షకులను రంజింపజేసిన ఆయన అసలు పేరు మంగలంపల్లి వెంకటే. అయితే.. ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో వ్యాపారం చేసిన ఆయన ఫిష్ వెంకట్‌గా గుర్తింపు పొందారు. దర్శకుడు వీవీ వినాయక్ ఆయనను వెండితెరకు పరిచయం చేశారు. దివంగత రియల్ స్టార్ శ్రీహరి కూడా వెంటక్ సినీ అరంగేట్రానికి సహాయం చేశారు. తనదైన కామెడీతో అనతికాలంలోనే ప్రేక్షకుల మనసుల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు ఫిష్ వెంకట్. వందకు పైగా చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేశారు. దిల్, ఆది, అత్తారింటికి దారేది బన్నీ, డీజే టిల్లు . వంటి సినిమాలు ఆయనకు విశేష గుర్తింపును తీసుకొచ్చాయి.

# రహస్య ఛేదనలో..




మహేష్‌బాబుతో రాజమౌళి రూపొందిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ కథాంశం గురించి అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆఫ్రికన్ సఫారీ అడ్వెంచర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మహేష్‌బాబు పాత్రని హనుమంతుడి స్ఫూర్తిగా తీర్చిదిద్దారని కూడా కథనాలొచ్చాయి. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్‌కు సిద్ధమవుతున్నది. దక్షిణాఫ్రికా లేదా టాంజానియాలో మూడో షెడ్యూల్‌కు రంగం సిద్ధం చేశారని సమాచారం. ఇదిలావుండగా ఈ సినిమా కథాంశం గురించి ఓ హాలీవుడ్ పత్రిక ఆసక్తికరమైన వివరాల్ని వెల్లడించింది. ఇండియానా జోన్స్‌తో పాటు ఆఫ్రికన్ అడ్వెంచర్ చిత్రాల నుంచి ప్రేరణ పొంది ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, ఓ రహస్య ఛేదన కోసం బలమైన శత్రువుతో కథానాయకుడి పోరాటం, ఈ క్రమంలో చోటుచేసుకునే మిస్టీరియస్ ఇన్సిండెట్స్, అంతుచిక్కని రహస్యాల్ని వశపరచుకున్న అడవిలో హీరో చేసే ప్రయాణం, కథాగమనంలో పురాణాలకు సంబంధించిన వ్యాఖ్యానాలు.. ఇవన్నీ ప్రేక్షకులకు అనుక్షణం ఉత్కంఠను పంచుతాయని సదరు పత్రిక తన కథనంలో పేర్కొంది. సాధారణంగా తన సినిమా కథల్ని ముందే చెప్పేస్తుంటారు రాజమౌళి. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం ఆయన ఇప్పటివరకు ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. దీంతో ఈ కథ గురించి అందరిలో ఆసక్తి పెరిగింది. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి అగ్ర తారలు ఈ సినిమాలో భాగమవుతున్న విషయం తెలిసిందే.

# జబర్దస్త్ మానేశానన్న మరో బ్యూటీ



ఆమె ఎవరో కాదు హాట్ బ్యూటీగా ఈ మధ్యకాలంలో బాగా ఫెమస్ అయిన రీతూ చౌదరి. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఈ చిన్నదానికి మంచి క్రేజ్ ఉంది. పలు టాక్ షోలకు హోస్ట్‌గా చేస్తుంది ఈ భామ. అలాగే టీవీ షోల్లోనూ కనిపిస్తుంది. సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ మంచి ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో రీతూ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఆది నేను కలిసి జబర్దస్త్ షోలో కొన్ని స్కిట్స్ చేశాం.. ఆది జబర్దస్త్ నుంచి బయటకు వచ్చేసిన తర్వాత నేను అక్కడ ఒక్కదాన్నే అయిపోయాను. ఆది వెళ్ళిపోయినా తర్వాత నేను ఒక్కదాన్నే ఇక్కడ ఏం చేస్తాను అని నేను కూడా బయటకు వచ్చేసా అని తెలిపింది. అలాగే ఆమె మాట్లాడుతూ.. నేను వీజే అవ్వాలని వచ్చాను.. మెల్లగా ఎదుగుతూ.. ఇప్పుడు ఈ పొజిషన్‌లో ఉన్నాను. కొన్ని టీవీ షోలు చేస్తున్నా అలాగే సినిమాల్లో ఛాన్స్ లకోసం ఎదురుచూస్తున్నా అని తెలిపింది. అలాగే కొన్ని ఆఫర్స్ కూడా వస్తున్నాయి. కానీ నేను కాస్త బోల్డ్ కాబట్టి నాకు అలాంటి పాత్రలే ఇస్తాం అంటున్నారు. బోల్డ్ పాత్రలు చేయడానికి నేను రెడీ కానీ దానికి ప్రాధాన్యత ఉండాలి అని చెప్పుకొచ్చింది.

# పిట్ట కొంచెం కూత ఘనం అంటే ఇదే..!



అభి పుట్టగానే తల్లి చనిపోవడం.. దీంతో అభిని తండ్రి కోదండ పాణి అలియాస్ వి.రవిచంద్రన్ అల్లారుముద్దుగా పెంచడం.. తండ్రి ప్రేమను హీరో కాస్త ఇబ్బందిగా ఫీలవడం..! ఇలా ఫాదర్ అండ్ సన్ సెంట్రిక్‌గా ఫస్ట్ ఆఫ్ సాగుతుంది. ఇదే ఫస్టాఫ్‌లో శ్రీలీలతో కాలేజ్‌లో లవ్.. అండ్ ఫన్..!!! ఇలా.. పడుతూ లేస్తూ ఫస్టాఫ్ ముందుకు వెళుతుంది. కానీ సెకండాఫ్‌కి వచ్చే సరికి జెనీలియా అలియాస్ విజయ సౌజన్య ఎంట్రీతో ఎమోషన్ మారుతుంది. 'తండ్రి - కూతురు' షేడ్ తీసుకుంటుంది. అందులోనూ తన ఆఫీస్ బాస్ జెనీలియాకి కిరీటికి మధ్య అసలు సంబంధం ఏంటనేది కూడా మనకు క్యూరియాసిటీ కలిగిస్తుంది. ఇక ఈ సినిమాకి మెయిన్ ప్లస్ పాయింట్ ఎమోషన్. తండ్రి కొడుకు, తండ్రి - కూతురు మధ్య ఎమోషన్ సీన్లు అందర్నీ ఆకట్టుకుంటాయి. దీనికితోడు క్లైమాక్స్‌లో ఎవ్వరూ ఊహించని విధంగా ఓ ట్విస్ట్ ఉంటుంది. అది మనల్ని షాకయ్యేలా చేస్తుంది. ఇక కిరీటి పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా ఉంటుంది. మనోడి యాక్టింగ్‌లో ఈజ్ ఉంది. ఎనర్జీ కూడా కాస్త ఎక్కువగానే ఉంది. వీటికి మించి కిరీటి డ్యాన్స్ టాప్ నాచ్. వైరల్ వయ్యారి పాటలో .. ఏకంగా శ్రీలీలనే డామినేట్ చేసిపడేశాడు. అంతేకాదు తన డ్యాన్సింగ్ స్టైల్‌తో తన ఫేవరట్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్‌ను ఖచ్చితంగా గుర్తుకుతెస్తాడు. డీఎస్పీ సాంగ్స్ , బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు వన్ ఆఫ్ ది ప్లస్ పాయింట్. ఎమోషనల్ సీన్లలో దేవీ మ్యూజిక్‌కి... కళ్లలో నీళ్లు తిరగడం పక్కా. ఇక ఓవర్ ఆల్‌గా చెప్పాలంటే జూనియర్ సినిమాతో కిరీటి ఇండస్ట్రీలో చాలా గట్టిగా పాతుకుపోతాడంటున్నారు.

# రామాయణలో సీత పాత్రకి సాయి పల్లవినే తీసుకోవడానికి కారణం ఏంటి?



భారతీయ పురాణేతిహాసం రామాయణం దశాబ్దాలుగా ఇటు వెండితెరపై, అటు బుల్లితెరపై ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉంది. ఇప్పటికే తెలుగుతో పాటు వివిధ భారతీయ భాషల్లో రామాయణగాథ పలుమార్లు దృశ్యమానం అయిన విషయం తెలిసిందే. తాజాగా నితేశ్ తివారీ దర్శకత్వంలో రామాయణం 'రామాయణ' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ చిత్రంలో సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్నారు. రావణాసురుడిగా కన్నడ అగ్ర నటుడు యష్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తొలిభాగానికి సంబంధించిన యాభైశాతం చిత్రీకరణ పూర్తయింది. 2026 దీపావళి కానుకగా తొలి పార్ట్ విడుదల చేయనున్నారు.

ఇండియన్ సినిమా హిస్టరీలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రామాయణ' ఇప్పటికే అన్ని వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పౌరాణిక చిత్రంలోని పాత్రల ఎంపిక, టెక్నికల్ టీమ్, విజన్ అన్ని కలిపి గ్రాండ్ లెవల్లో రూపొందుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన చిన్న గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ఇటీవల చిత్ర యూనిట్ కీలక విషయాలు వెల్లడించింది. ఇందులో ముఖ్యంగా రణ్‌బీర్ కపూర్ మరియు సాయిపల్లవి ఎంపికపై ఆసక్తికర విషయాలు తెలియజేశారు. రణ్‌బీర్‌ను రాముడిగా తీసుకోవడం వెనుక కారణం ఆయనలో ఉన్న అద్భుత నటనా నైపుణ్యం, సహజమైన ప్రశాంతత, ఆత్మవిశ్వాసం. రాముడి పాత్రక ఆయన సరిపోయాడని మేకర్స్ తెలిపారు.

సాయిపల్లవిని సీతాదేవిగా ఎంపిక చేయడం వెనుక కారణం ఏంటంటే ఆమె గ్లామర్ పాత్రలకి దూరంగా ఉండటం, అందం కోసం ఎలాంటి సర్జరీలు చేయించుకోకపోవడం వంటి కారణాలే ప్రధానమని చెప్పారు. కృత్రిమ అందంకన్నా సహజత్వమే పెద్దదని, ఆమె రూపం ఆ పాత్రను నమ్మదగినదిగా చేస్తుందని పేర్కొన్నారు. రెండు పార్ట్‌లుగా రూపొందుతున్న రామాయణ మొదటి భాగం 2026లో దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానుంది అని ఇప్పటికే నిర్మాతలు ప్రకటించారు. 'రామాయణ' కోసం దేశం మొత్తం ఎదురు చూస్తోంది. పాత్రల ఎంపిక, కథా నిర్మాణం, టెక్నికల్ డిపార్ట్‌మెంట్ పై భారీ నమ్మకం నెలకొంది. పౌరాణిక ఇతిహాసాన్ని అత్యాధునిక టెక్నాలజీతో తెరపైకి తీసుకురాబోతున్నారు మేకర్స్.


Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com